

బజరంగ్‌దళ్ నాయకుడు భరత్‌కు హైకోర్టులో ఊరట

బెంగళూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): బజరంగ్‌దళ్ దక్షిణకన్నడ జిల్లా కన్వీనర్ భరత్ కుమ్డేలుకు పోలీసులు విధించిన జిల్లా బహిష్కరణపై హైకోర్టులో ఊరట లభించింది. మార్చి 28 నుంచి జూన్ 30వరకు భరత్‌ను దక్షిణకన్నడ జిల్లా నుంచి మైసూరు జిల్లా సరస్వతిపురం పోలీస్ స్టేషన్ పరిధికి పంపేలా మంగళూరు ఉపవిభాగం ఆర్‌డీఓ హర్షవర్ధన్ ఆదేశాలు జారీ చేశారు. దీనిపై భరత్ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన ధర్మాసనం ఆర్డీఓ ఆదేశాలను రద్దు చేస్తూ శనివారం తీర్పును వెలువరించింది. బంట్వాళ తాలూకా పుదు గ్రామానికి చెందిన భరత్‌పై రౌడీషీటర్ నమోదు కావడంతో బహిష్కరించారు.



అసమ్మతి సెగ

- మూడు పార్టీల్లోనూ అదే తీరు
- కాంగ్రెస్‌కు ఇంటిపోరు..బీజేపీకి సీనియర్ల తలనొప్పి
- హాసన్‌లో జేడీఎస్‌కు ముచ్చెమటలు
- 7 స్థానాలపై కమలనాథుల ప్రత్యేక దృష్టి



బెంగళూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు గెలుపొందాలని భావిస్తున్న కాంగ్రెస్, బీజేపీలకు అసమ్మతి సెగ వెంటాడుతోంది. 28 లోక్‌సభ స్థానాల్లో తొలి విడతలో 14 నియోజకవర్గాలకు నామినేషన్ల పరిశీలనలు ప్రారంభమయ్యాయి. మరో 14 స్థానాలకు త్వరలోనే ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. 28 నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేశారు. ఎవరికి వారు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. ఇటు కాంగ్రెస్, అటు బీజేపీకి ఇంటి పోరు తప్పడం లేదు. రాష్ట్ర నేతలతోపాటు ఢిల్లీ పెద్దలు రంగంలోకి దిగుతున్నారు. అయినా అసమ్మతులను పూర్తిస్థాయిలో బుజ్జగించడం సవాలుగా మారుతోంది. బాగల్కోటె కాంగ్రెస్ అభ్యర్థి సోదరుడు బీజేపీలో చేరగా శివమొగ్గలో సీనియర్ నేత కేఎస్ ఈశ్వరప్ప అధిష్టానం తాను పోటీ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని కార్యకర్తలను ఇరకాటంలో పెట్టారు. హాసన్‌లో జేడీఎస్‌తో కలసి పనిచేసేందుకు మాజీ ఎమ్మెల్యే ప్రీతంగౌడ ఆసక్తి చూపలేదు. బీజేపీ అగ్రనేత అమిత్‌షా పిలుపు మేరకు ఢిల్లీ వెళ్లిన ఈశ్వరప్పకు అపాయింట్‌మెంట్ లభించలేదు. అమిత్‌షా పిలుపు తర్వాత చర్చలకు వెళ్తానుగానీ పోటీ నుంచి వెనుకడుగు వేసేది లేదనే ఆయన ప్రకటనతోనే అమిత్‌షా భేటీకి నిరాకరించినట్టు తెలుస్తోంది. బాగల్కోటె కాంగ్రెస్ అభ్యర్థి సంయుక్త పాటిల్ సోదరుడు హర్షగౌడ పాటిల్ శుక్రవారం బీజేపీలో చేరారు. సంయుక్త పాటిల్ స్థానికులు కారనే విమర్శలు ఎదుర్కొంటున్న సమయంలోనే కుటుంబానికి చెందినవారే ప్రత్యర్థి పార్టీలోకి వెళ్లడం తలనొప్పిగా మారింది. మంత్రి శివానంద పాటిల్ బాగల్కోటె టిక్కెట్‌ను కుమార్తె సంయుక్త పాటిల్‌కు సాధించుకోవడంలో సఫలీకృతులయ్యారు. ఆయన సోదరుడు సంయుక్త పాటిల్ తరపునే ప్రచారం చేస్తున్నారు. సోదరుడి కుమారుడు హర్షగౌడ పాటిల్ మాత్రం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర సమక్షంలో బీజేపీలో చేరారు. అన్నాచెల్లెళ్ల మధ్యనే వివాదం తలెత్తింది. ఇంకా నామినేషన్ల ప్రక్రియ రాకమునుపే బాగల్కోటె రాజకీయంలో గందరగోళం నెలకొంటోంది. ఇక ఉత్తరకన్నడ జిల్లా బీజేపీ అభ్యర్థి విశ్వేశ్వరహెగ్డే కాగేరికి స్థానిక ఎంపీ అనంతకుమార్ హెగ్డే సహకారం లభించడం లేదు. బీజేపీ నాయకుల రాజీ ప్రయత్నాలు ఫలించడం లేదు. రాజీ కోసం కాగేరి చేస్తున్న మంతనాలు ఎక్కడికక్కడ బెడిసి కొడుతున్నాయి. కాగేరి శిరసి కేంద్రంగా రాజకీయాలు చేస్తున్నారని, జిల్లా విభజనకు ప్రయత్నించారని, ఉత్తరకన్నడ జిల్లా కేంద్రం కారవారలో ఉండాల్సిన పలు కార్యాలయాలు తరలించారనే పోస్టింగ్ సర్వత్రా విమర్శలకు కారణమవుతోంది. మరోవైపు యల్లాపుర బీజేపీ ఎమ్మెల్యే శివరాం హెబ్బార్ సొంత పార్టీకి సహకరించడం లేదు. ఉత్తరకన్నడ జిల్లా లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ పోటీ ప్రారంభించింది. అప్పటి నుంచి ఒకే సామాజిక వర్గానికి టిక్కెట్ కేటాయించడం ద్వారా ఇతర సామాజికవర్గాల్లో అసంతృప్తి పెరుగుతోంది.

హాసన్‌లో జేడీఎస్‌కు ముచ్చెమటలు

బీజేపీతో జేడీఎస్ మైత్రి ఏర్పాటు చేసుకుని మూడు నియోజకవర్గాలను ఎంపిక చేసుకుంది. అందులో హాసన్, మండ్య, కోలారు ఉన్నాయి. మండ్యలో సుమలత బీజేపీకి మద్దతు ఇవ్వడంతో పెనుగండం తప్పినట్లయింది. హాసన్‌లో పరిస్థితి జేడీఎస్ అభ్యర్థి ప్రజ్వల్ రేవణ్ణకు ముచ్చెమటలు పట్టిస్తోంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర జిల్లా పర్యటన వేళ ప్రీతమ్ గౌడ, మాజీ ఎమ్మెల్యే ఏటీ రామస్వామి గైర్హాజరు ద్వారా నిరసన వ్యక్తం చేశారు. ఈనెల 4న సమన్వయ సమావేశానికి వారు హాజరు కాలేదు. 2023 శాసనసభ ఎన్నికల్లో ప్రీతమ్‌గౌడను ఓడించిన జేడీఎస్ పార్టీకి ప్రస్తుతం మద్దతు ఇవ్వాలని ప్రజ్వల్ రేవణ్ణ విజయానికి సహకరించాలన్న పార్టీ హైకమాండ్ సూచనను అంగీకరించే పరిస్థితి లేదు. అగ్రనేతలు తప్పనిసరిగా పనిచేయాలని నిబంధన ఉంచితే పనిచేసేందుకు సుముఖత చూపవచ్చు. ఓట్లశాతాన్ని పెంచడంలో సహకారం అందించడం అంతంత మాత్రమేనని తెలుస్తోంది. 2009 ఎన్నికల్లో నామినేషన్లలో తప్పుడు సమాచారం ఇచ్చారని ప్రజ్వల రేవణ్ణపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన దేవరాజ్ గౌడ కూడా రెబెల్ అయ్యారు. ప్రస్తుత ఎన్నికల్లో హాసన్‌కు చెందిన బీజేపీ నాయకులందరినీ సమైక్యంగా పనిచేయించడం అంత సులువు కాదనిపిస్తోంది.

ఏడు స్థానాలపై బీజేపీ పెద్దల ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలో పోలింగ్‌కు మరికొన్ని రోజులే గడువున్నా కొన్ని చోట్ల అసమ్మతి సెగలు కొనసాగుతున్న తరుణంలో బీజేపీ అధిష్టానం ప్రత్యేకించి ఏడు స్థానాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు సమాచారం. 2019 ఎన్నికల్లో బీజేపీ 25 స్థానాల్లో గెలుపొందింది. ఇండిపెండెంట్, కాంగ్రెస్, జేడీఎస్‌లు ఒక్కోస్థానానికే పరిమితమయ్యారు. ప్రస్తుతం బీజేపీతో పొత్తు ఉండడంతో జేడీఎస్‌కు మూడు స్థానాలు కేటాయించారు. మిగిలిన స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు బరిలో ఉన్నారు. ప్రస్తుత ఎన్నికల్లోనూ ఎక్కువసీట్లు సాధించాలని అధిష్టానం స్థానిక నేతలకు హెచ్చరిస్తూ వస్తోంది. ఇప్పటికే రాష్ట్ర నేతలు యడియూరప్ప, ప్రహ్లాద్‌జోషి కొంతమేర అసమ్మతిని తగ్గించారు. ఇంకా పలు చోట్ల అసమ్మతి కొనసాగుతోంది. అమిత్‌షా ఆదేశాల మేరకు ఢిల్లీ నుంచి ప్రత్యేక బృందం రాష్ట్రంలో పర్యటించి ఏడు నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే ఆ నియోజకవర్గాలపై రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రాధామోహన్‌దాస్ అగర్వాల్ ఓ నివేదిక ఇచ్చినట్టు తెలుస్తోంది. వీటిలో మైసూరు, చిక్కబళ్లాపుర, హాసన్, కొప్పళ, బెళగావి, మండ్య, బెంగళూరు ఉత్తర నియోజకవర్గాలు ఉన్నాయి. గెలుపొందే అవకాశాలు ఉన్న స్థానాల్లో అసమ్మతి పేరిట చీలికలు కొనసాగితే సహించరాదని హెచ్చరించినట్టు సమాచారం.



హెచ్ విశ్వనాథ్‌తో కలసి కుమారస్వామి తదితరులు

ఒక్కటైన కుమార, విశ్వనాథ్

బెంగళూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సుమారు నాలుగన్నరేళ్ల కాలంగా దూరంగా ఉంటూ వచ్చిన బీజేపీ ఎమ్మెల్సీ హెచ్ విశ్వనాథ్, జేడీఎస్ నేత కుమారస్వామి ఒక్కటయ్యారు. మైసూరు జిల్లా కేఆర్ నగర్‌లోని విశ్వనాథ్ నివాసానికి శనివారం కుమారస్వామి వచ్చారు. కుమారస్వామిని సాదరంగా విశ్వనాథ్ కుటుంబ సభ్యులు స్వాగతించారు. అనంతరం విశ్వనాథ్ మాట్లాడుతూ దేవెగౌడ ఆశీస్సులు తనపై ఎప్పుడూ ఉంటాయన్నారు. సా రా మహేశ్‌తో తనకు విభేదాలు వచ్చాయని, అయితే ఇప్పుడు కలసి ఉన్నామని తెలిపారు. కుమారస్వామి తమ ఇంటికి వచ్చారని, సంతోషదాయకమన్నారు. కాంగ్రెస్‌లో 17మంది వారసులు, కుటుంబ సభ్యులకు టిక్కెట్లు ఇచ్చారని, దేవెగౌడ కుటుంబం గురించి మాట్లాడే నైతికత ఎవరికీ లేదన్నారు. యదువంశానికి చెందిన మైసూరు యువరాజును ఏకగ్రీవంగా గెలిపించాలని పేర్కొన్నారు. దేవెగౌడ కుటుంబాన్ని ఓడిస్తామనే మాటలు సిద్దరామయ్య వీడాలని, అహంకారం పనికిరాదన్నారు. మైసూరులో యతీంద్రకు టిక్కెట్ ఇప్పించాలని సిద్దరామయ్య ప్రయత్నించారన్నారు. సర్వేలు వచ్చాక లక్ష్మణ్‌కు కట్టబెట్టారన్నారు. కాగా విశ్వనాథ్, జేడీఎస్‌ను వీడి బీజేపీ ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. బీజేపీలో రెబెల్‌గా మారి కాంగ్రెస్ నేతలతో దాదాపు రెండేళ్లపాటు చట్టాపట్టాలేసుకుని తిరిగారు. అనూహ్యంగా ఎన్నికలవేళ బీజేపీ-జేడీఎస్ కూటమికి మద్దతు ప్రకటించారు.



ఎన్నికల బరిలో ఆరుగురు శ్రీమంతులు

బెంగళూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో ఆరుగురు బడా శ్రీమంతులు ఉన్నారు. మొదటి విడతలో జరుగుతున్న 14 స్థానాలకు గాను 276 మంది అభ్యర్థులు బరిలో ఉన్నా దాదాపు అన్ని చోట్లా కాంగ్రెస్, బీజేపీ- జేడీఎస్ పార్టీల మైత్రీ అభ్యర్థులే కీలకంగా ఉన్నారు. తొలి విడత ఎన్నికల నామినేషన్ల పరిశీలనలు ముగిశాయి. ఈ ఎన్నికల్లో ఆరుగురు శ్రీమంతులైన అభ్యర్థులు తమ భవిష్యత్తు కోసం పోటీ పడుతున్నారు. మండ్య కాంగ్రెస్ అభ్యర్థి వెంకటరమణేగౌడ అలియాస్ స్టార్ చంద్రు ఏకంగా రూ.622 కోట్ల మేర ఆస్తులు కలిగి ఉన్నారు. బెంగళూరు గ్రామీణ కాంగ్రెస్ అభ్యర్థి డీకే సురేష్ రూ.593 కోట్లు కలిగి ఉన్నట్లు ప్రకటించారు. మండ్య నుంచి బీజేపీ - జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థి హెచ్‌డీ కుమారస్వామి రూ.217.2 కోట్లుగా తన ఆస్తులను వెల్లడించారు. బెంగళూరు ఉత్తర కాంగ్రెస్ అభ్యర్థి ప్రొఫెసర్ ఎంవీ రాజీవ్‌గౌడ రూ.134 కోట్లు, చిక్కబళ్లాపుర కాంగ్రెస్ అభ్యర్థి రక్షారామయ్య రూ.99.80 కోట్లుగా చూపారు. బెంగళూరు గ్రామీణ బీజేపీ అభ్యర్థి డాక్టర్ సీఎన్ మంజునాథ్ రూ.98.30 కోట్లు ఆస్తులు కలిగినట్లుగా వెల్లడించారు. కాగా ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేస్తున్న వారిలో అత్యంత తక్కువ ఆస్తులు ఉన్నవారిలో దక్షిణకన్నడ బీజేపీ అభ్యర్థి కెప్టెన్ బ్రిజేష్ చౌట రూ.70.80 లక్షలు, దక్షిణకన్నడ కాంగ్రెస్ అభ్యర్థి పద్మరాజ్ రూ.1.80 కోట్లు, ఉడుపి-చిక్కమగళూరు అభ్యర్థి కోటా శ్రీనివాస పూజారి రూ.1.10 కోట్లు, బెంగళూరు దక్షిణ కాంగ్రెస్ అభ్యర్థి సౌమ్యారెడ్డి రూ.2.30 కోట్లుగా చూపారు. ఇదే స్థానం బీజేపీ అభ్యర్థి తేజస్వీ సూర్య రూ.4.1 కోట్లు, చిత్రదుర్గ బీజేపీ అభ్యర్థి గోవింద కారజోళ రూ.4.30 కోట్ల ఆస్తులు ఉన్నట్లు నమోదు చేశారు.



రక్షా రామయ్య



మంజునాథ్



స్టార్ చంద్రు



డీకే సురేశ్



కుమారస్వామి



రాజీవ్ గౌడ



అదుపు తప్పిన రథం

బొమ్మనహళ్లి, ఏప్రిల్ 6: ఎలక్ట్రానిక్‌సిటీ పరిధిలోని హెగ్గనహళ్లి నుంచి హుస్కూరుకు వస్తున్న 126 అడుగుల భారీ రథం శనివారం హీలలిగె గ్రామం వద్ద అదుపు తప్పింది. హుస్కూరు జాతరలో భాగంగా ప్రధాన రథోత్సవం ఆదివారం జరగనుండగా ఇందులో పాల్గొనేందుకు హెగ్గనహళ్లి నుంచి వస్తున్న రథాన్ని సుమారు 30 ఎడ్లకుపైగా రథాన్ని లాగాయి. అకస్మాత్తుగా రథం అదుపు తప్పింది. ఎటువంటి ప్రాణనష్టం చోటు చేసుకోలేదు. రథం అకస్మాత్తుగా ఒరిగి కిందపడిపోవడంపై భక్తుల్లో నిరాశ నెలకొంది. దెబ్బతిన్న రథాన్ని తొలగించేందుకు క్రేన్లను రంగంలో దించారు. వందేళ్లకు పైగా జాతరలో ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం ఇదే ప్రథమమని తెలుస్తోంది. గుట్టహళ్లి, రాయసంద్ర, ముత్తనల్లూరు, సింగేన అగ్రహార, రామసాగర, హులిమంగల, రాయసంద్ర తదితర గ్రామాల నుంచి గ్రామదేవతలు హుస్కూరుకు శనివా రం రాత్రి చేరుకున్నారు. ఆదివారం హుస్కూరులోని గ్రామదేవత మద్దూరమ్మ జాతర వైభవంగా జరగనుంది. బెంగళూరు గ్రామీణ, నగర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు.



పడిపోయిన రథం ఇలా..

చౌడేశ్వరి ఆలయంలో పంచాంగానికి పూజలు


బెంగళూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): క్రోధి నామసంవత్సరం ఉగాదిని పురస్కరించుకుని ఆంధ్రజ్యోతి అనుబంధంగా ఆదివారం పాఠకులకు పంపిణీ చేస్తున్న పంచాంగం పుస్తకాలకు ప్రత్యేక పూజలు జరిపించారు. యలహంకలో వెలసిన చౌడేశ్వరి దేవి ఆలయంలో శనివారం రాత్రి ఆంధ్రజ్యోతి జనరల్ మేనేజర్ జీవీ శ్రీకాంత్ ప్రత్యేక పూజలు చేయించారు. అర్చకుడు వేణుగోపాలశర్మకు ఉగాది పంచాంగం పుస్తకాలను అందించారు. కెనరాబ్యాంకు స్పాన్సర్‌షిప్‌తో పంచాంగం పుస్తకాలను రూపొందించారు.



అర్చకుడికి పంచాంగం అందజేస్తున్న జీఎం శ్రీకాంత్

చిక్కుల్లో కాంగ్రెస్ అభ్యర్థి సునిల్‌బోస్

- నామినేషన్ పత్రంపై బీజేపీ అభ్యంతరం
- కుటుంబ వివరాలు పేర్కొనలేదని ఫిర్యాదు



బెంగళూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మహదేవప్ప కుమారుడు, చామరాజనగర లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి సునిల్‌బోస్ నామినేషన్ దాఖలు వేళ సమగ్రంగా వివరాలు నమోదు చేయకపోవడాన్ని బీజేపీ అభ్యంతరం లేవనెత్తడంతో చిక్కుల్లో పడ్డారు. నామినేషన్ దాఖలు సందర్భంగా సునిల్‌బోస్ వైవాహిక జీవనం గురించి ఎక్కడా నమోదు చేయలేదు. భార్య, తల్లిదండ్రుల ఆస్తుల వివరాలు పేర్కొనలేదు. దీనిపై చామరాజనగర లోక్‌సభ బీజేపీ అభ్యర్థి బాలరాజు జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. నామినేషన్ దాఖలు వేళ సమగ్ర వివరాలు నమోదు చేయని సునిల్‌బోస్ పత్రాన్ని స్వీకరించరాదని డిమాండ్ చేశారు. పరిశీలన వేళ అధికారులు ఎటువంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదు. ఒక వేళ బీజేపీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి ఒత్తిడి తీసుకువస్తే వారి పరిశీలనలో నామినేషన్ తప్పుగా ఉన్నట్లు నిర్ధారణ అయితే సునిల్‌బోస్ తీవ్రమైన పరిస్థితిని ఎదుర్కోక తప్పదు.

వయసు పైబడిన దేవెగౌడకు పొత్తు అవసరమా..?

- మరోసారి నోరుజారిన మంత్రి రాజణ్ణ
- విరుచుకుపడిన కుమారస్వామి




బెంగళూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ప్రధాని దేవెగౌడపై రాష్ట్ర సహకారశాఖ మంత్రి రాజణ్ణ మరోసారి నోరు పారేసుకున్నారు. వయసు పైబడిన వేళ దేవెగౌడ బీజేపీతో అపవిత్రమైన మైత్రి ఏర్పాటు చేసుకున్నారని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన తుమకూరులో మాట్లాడుతూ జీవన చరమాంకంలో ఇటువంటి ఒప్పందం అవసరమా..? అని ప్రశ్నించారు. గడిచిన లోక్‌సభ ఎన్నికల్లో తనను ఓడించినవారిని గెలిపించరాదని దేవెగౌడ డిమాండ్ చేశారని గుర్తు చేశారు. కానీ ప్రస్తుత ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి సోమణ్ణ, ఎంపీ బసవరాజ్‌ను పక్కనే కూర్చోబెట్టుకుని ఓట్లు అడుగుతున్నారని ఎద్దేవా చేశారు. గత ఎన్నికల్లో దేవెగౌడను ఓడించింది వారు కాదా..? అని ప్రశ్నించారు. ప్రస్తుతం ప్రజలు ఎవరిని ఓడించాలి, ఎవరిని గెలిపించాలని ప్రశ్నించారు.

మంత్రి తీరుపై కుమార ఆగ్రహం

దేవెగౌడపై అనుచితమైన వ్యాఖ్యలు చేసిన మంత్రి రాజణ్ణపై కుమారస్వామి విరుచుకుపడ్డారు. శనివారం ఆయన మాట్లాడుతూ దేవెగౌడ ఆశీస్సులతోనే రాజణ్ణ విధానసౌధ మెట్లు ఎక్కారనే విషయాన్ని మరువరాదన్నారు. దేవెగౌడ భూమిలో కలిసేంతవరకు రాజకీయ విరమణ ఉండదన్నారు. ఆయన నుంచి రాజకీయాలు నేర్చుకుని ఇప్పుడు విమర్శించే స్థాయికి వెళ్లడాన్ని కుతంత్రం, నీచమైన బుద్ధిగా అభివర్ణించారు. ఇలాంటి వారి ఆగడాలు ఎక్కువకాలం ఉండవని అన్నారు. కాంగ్రెస్ నాయకులు పుల్వామా అంశాన్ని ఇప్పుడెందుకు ప్రస్తావిస్తున్నారన్నారు. వీరికి మాట్లాడేందుకు సబ్జెక్టులు లేవన్నారు.



బీజేపీ నేతలతో ప్రచారంలో మాజీ ప్రధాని దేవెగౌడ



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,579.63	1,581.04
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	928	5,833
సామర్థ్యం (టీఎంసీలు)	4.29	5.00

కవలూరికి కలుషిత నీరే దిక్కు

● ఎన్ని ఎన్నికలు వచ్చినా మారని తలరాతలు

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 6: ఈ ఫొటో చూస్తే చాలు ఈ గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి పరిస్థితి ఏమిటో ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది. కొప్పళ జిల్లా కవలూరు గ్రామానికి చుట్టు ప్రక్కల ఎక్కడా తాగునీటి వనరులు లేకపోవడంతో గ్రామం ప్రక్కనే ఉన్న చెరువులో మిగిలిన మురికినీటినే తాగునీటిగా వాడుకునే దుర్భర పరిస్థితి ఏర్పడింది. కవలూరు గ్రామంలో ఆర్వో ప్లాంటులు ఉన్నా మరమ్మతుల పేరుతో అవి మూతబడ్డాయి. దీంతో చేసేది లేక ఆ గ్రామ ప్రజలు చెరువులోని మురికి నీటినే వడబోసుకుని తాగుతున్నారు. దాహం తీర్చుకుంటున్నారు.

కొప్పళ జిల్లా కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామంలో సుమారు పదివేల మంది జనాభా ఉన్నారు. ఈ గ్రామంలో నాలుగు శుద్ధనీటి ఆర్వో యూనిట్లు ఉన్నా అందులో ఏ ఒక్కటీ పనిచేయడం లేదు. నిత్యం కవలూరు గ్రామ ప్రజలు సైకిల్, ద్విచక్ర వాహనాలపై ఈ చెరువు నుంచి బిందెలతో నీటిని తీసుకెళుతున్న దృశ్యాలు ఇక్కడ సర్వసాధారణం. ఆకతాయిలు ఇదేనీటిని అపరిశుభ్రం చేసే విధంగా గుట్కాలు తిని ఇందులో వేస్తుంటారు.. తుంగభద్ర బ్యాక్‌వాటర్ వచ్చే ఈ గ్రామానికి జాక్‌వెల్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ విషయంపై తాలూకా పంచాయతీ ఈఓ మాట్లాడుతూ కవలూరు గ్రామంలో మూడు ప్రైవేట్ బోర్లను అద్దెకు తీసుకున్నామని, నిత్యం నాలుగు ట్రాక్టర్ల ద్వారా తాగునీటి సరఫరా చేస్తున్నామని తెలిపారు. అయినా కొంతమంది చెరువునీటినే ఉపయోగిస్తున్నారన్నారు. ఎక్కడైనా శుద్ధమైన తాగునీరు లభిస్తే, ఈ మురికినీరు తాగాలని ఎవరైనా మోజుపడతారా? ఏలిన వారికి అంతమాత్రం ఆలోచన ఉండదా? గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారం అయ్యేవంత వరకు ఇలాంటి దృశ్యాలు చూడక తప్పదు మరి.



చెరువులో కలుషిత నీటిని బిందెలతో తీసుకెళుతున్న కవలూరు గ్రామస్థులు

ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఫ్లెక్సీలు



జనవిడిది సర్కిల్లో ఆకర్షణగా నిలిచిన ఫ్లెక్సీలు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 6: ఓటింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించడానికి, ఎన్నికలలో పాల్గొనేలా ప్రజలను ప్రోత్సహించేందుకు స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) కమిటీ పలు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటుచేస్తోంది. జిల్లాలోని ఐదు తాలూకాలలో ప్రతి గ్రామ పంచాయితీ పట్టణ పంచాయితీ మున్సిపాలిటీ పరిధిలో ఎన్నికల అవగాహన బ్యానర్లు ఏర్పాటు చేసింది. దీని ద్వారా ఓటింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికల తేదీని ప్రకటించిన క్షణం నుంచి జిల్లా యంత్రాంగం, జిల్లాస్వీప్ కమిటీ అధికారికంగా ఓటింగ్ అవగాహన పనులను ప్రారంభించింది. ముఖ్యంగా ఓటింగ్ శాతం తక్కువగా ఉన్న పోలింగ్ స్టేషన్ ప్రాంతాల్లో ఓటర్లకు ఓటు ప్రాముఖ్యతను తెలియజేసేందుకు చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. పోలింగ్ శాతం తక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు ఎన్నికల సిబ్బంది పర్యటిస్తున్నారు.

నకిలీ కుల ధ్రువీకరణపై విచారణ జరగాలి



కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న దళిత హక్కుల కమిటీ

బళ్లారి సిటీ, ఏప్రిల్ 6: విజయనగర శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ ప్రొఫెసర్ మేత్రి నకిలీ ధ్రువీకరణ పత్రంపై విచారణ చేపట్టాలని దళిత హక్కుల కమిటీ అదనపు జిల్లాకలెక్టర్ మహ్మద్ జుబేరా ద్వారా గవర్నర్‌కు వినతి పత్రం పంపింది. మేత్రి షెడ్యూల్డ్ కులానికి చెందిన తప్పుడు ధృవీకరణ పత్రాన్ని పొందడంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని దళిత హక్కుల కమిటీ డిమాండ్ చేసింది. హంపీ కన్నడ యూనివర్శిటీలో షెడ్యూల్డ్ తెగలకు రిజర్వ్ చేయబడిన లెక్చరర్ పోస్టును గోండా కులానికి చెందిన మేత్రి నకిలీకుల ధృవీకరణ పత్రం ద్వారా పొందాడని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈవిషయంలో జాప్యానికి కారణమైన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు నిజమని రుజువైతే వారి ఆస్తులను జప్తు చేయాలని డిమాండ్ చేస్తూ సంస్థకు చెందిన జె.సత్యబాబు, శివశంకర్ తదితరులు జిల్లాయంత్రాంగానికి వినతి పత్రం సమర్పించారు.

ఓఆర్ఎస్‌తో డీహైడ్రేషన్ నుంచి విముక్తి



ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందిస్తున్న ఆరోగ్య అధికారులు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 6: ప్రస్తుత వేసవిలో జిల్లావ్యాప్తంగా ఎండలు విపరీతంగా ఉన్నాయని, జిల్లా యంత్రాంగం, జిల్లావిపత్తు నిర్వహణ సంస్థ సహకారంతో ఓఆర్ఎస్ పౌడర్ సిద్ధం చేసినట్లు జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ అధికారి రమేశ్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్జలీకరణాన్ని నివారించడానికి అత్యవసర చికిత్స కేంద్రాలు, ముఖ్యమైన జాతరలు జరిగే ప్రదేశాలలో వీటిని ప్రజలకు అందించాలన్నారు. ఇప్పటికే జిల్లా కలరా బృందం నిరంతరం తాగునీటి వనరులను పరిశీలించి తాగేందుకు అనువుగా ఉన్నాయని నిర్ధారించడంతో జాతరలో వాంతులు విరేచనాల కేసులు నమోదు కాలేదన్నారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే విధులు నిర్వహిస్తున్న చెక్‌పోస్టు సిబ్బందికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేస్తున్నామన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటనుంచి సాయంత్రం 4గంటల వరకు నీడలో పనిచేయాలన్నారు. అన్నితాలూకా ప్రభుత్వ ఆసుపత్రులు సామాజిక ఆరోగ్య కేంద్రాలు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ఓఆర్ఎస్ ఐవీ ఫ్లూయిడ్స్, లైఫ్ సేవింగ్ డ్రగ్స్ నిల్వ ఉంచుకోవాలన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



సిరుగుప్పలో బీజేపీ జెండాను ఎగురవేస్తున్న జిల్లా యువమోర్చా అధ్యక్షుడు ఎంఎస్ సిద్దప్ప



బళ్లారి బీజేపీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ప్రముఖులు



కంప్లిలో జెండా ఎగురవేస్తున్న నాయకులు



ఎర్రగుడిలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం నగరంలోని బీజేపీ జిల్లాకార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ పార్టీ కార్యాలయంలో జెండాను ఎగురువేశారు. ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో శాసనమండలి సభ్యుడు ఎం.సతీశ్, మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి, గాలి లక్ష్మీ అరుణ తదితరులు పాల్గొన్నారు. సిరుగుప్పలో బీజేపీ జిల్లా యువమోర్చా అధ్యక్షుడు ఎంఎస్ సిద్దప్ప, బీజేపీ తాలుకా అధ్యక్షుడు కుంటనహాళ్ మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. సిరుగుప్ప పట్టణ బీజేపీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జెండాను ఎగురవేశారు. అనంతరం పార్టీ కార్యాలయం నుంచి గాంధీజీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కంప్లి బీజేపీ కార్యాలయం వద్ద అధ్యక్షులు హళ్లళ్లి వీరేష్, సీఆర్ హనుమంతు, కార్యకర్తలు శనివారం బీజేపీ జెండాను ఎగురవేసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. బళ్లారి తాలుకాలోని ఎర్రగుడి గ్రామంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ప్రకాష్, మండల ప్రధాన కార్యదర్శి లోకేష్ రెడ్డిల నేతృత్వంలో ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎర్రగుడి గ్రామంలోని సుంకులమ్మ దేవస్థానం కొత్త బస్టాండు నుంచి బెణకల్లు రోడ్డు వరకు కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు.

✍ బళ్లారి సిటీ,రూరల్, సిరుగుప్ప, కంప్లి

ఓటింగ్‌పై వాడవాడలా అవగాహన శిబిరాలు



ఓటింగ్ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి సతీశ్



హొసపేటలో ఓటింగ్‌పై అవగాహన కల్పించేందుకు జిల్లా యంత్రాంగం, జర్నలిస్టుల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్

బళ్లారి సిటీ,ఏప్రిల్ 6: ఓటు వేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తప్పకుండా ఓటు వేయాలని సండూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి హెచ్‌కే. సతీశ్ అన్నారు. సండూరులోని శ్రీశైలేశ్వర్ బీఈడీ శిక్షణ కళాశాలలో జిల్లా యంత్రాంగం, జిల్లాస్వీప్ కమిటీల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటు వేయడం ఒక పవిత్ర కార్యమని అర్హులైన ప్రతి ఒక్కరు ఓటింగ్‌లో పాల్గొనాలని కోరారు. తాలూకా పంచాయితీ కార్యనిర్వహణాధికారి తాలూకా స్వీప్ నోడల్ అధికారి షడక్షరయ్య మాట్లాడుతూ ఎక్కడో దూరంగా ఉంటున్నవారికి అవగాహన కల్పించి ఎన్నికలలో పాల్గొనేలా చైతన్యవంతులను చేయాలని సూచించారు.

బెనకల్ గ్రామంలో ఓటింగ్ అవగాహన జాతా

బళ్లారి రూరల్లోని యర్రగుడి గ్రామపంచాయితీపరిధిలోని బెనకల్ గ్రామంలో శనివారం జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయితీ, జిల్లాస్వీప్ కమిటీ, తాలూకా పరిపాలన యంత్రాంగం ఆధ్వర్యంలో ఓటర్ల అవగాహన జాతా నిర్వహించారు. తాలూకా పంచాయితీ కార్యదర్శి గోవిందప్ప మాట్లాడుతూ మే 7న పోలింగ్‌రోజున ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు వేయాలని అవగాహన జాతాలో తెలిపారు.

కూలీలకు ఓటు హక్కుపై అవగాహన

కంప్లి, ఏప్రిల్ 6 :

కంప్లి తాలుకా స్థాయి అధికారులైన ఈవో, ఏడీ అధికారులు ఉపాధి కూలీలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. తమ అమూల్యమైన ఓటును ప్రతి ఒక్కరు మే 7వ తేదీన ఉపయోగించుకోవాలన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోబడకుండా తమ అమూల్యమైన ఓటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పశుగ్రాసానికి డిమాండ్

ఇబ్బందులు పడుతున్న రైతులు

కంప్లి, ఏప్రిల్ 6 : రబీలో వరి పంట అధికంగా వేయకపోవడంతో పశుగ్రాసం లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి యేడాది ఖరీఫ్, రబీ సీజనుల్లో వరి పంట వేసుకుంటే పశువులకు కావలసిన మేత దొరికేది. రైతులకు ఎలాంటి సమస్య వుండేది కాదు. కానీ ఈ యేడాది వర్షాభావం వల్ల జలాశయంలో నీరు లేక కేవలం ఒకే ఖరీఫ్ పంటను మాత్రం రైతులు పండించుకోవడంతో కొద్దిమంది రైతన్నలు మాత్రమే పశుగ్రాసం నిల్వ చేపట్టుకున్నారు. ఈ రబీ పంటల్లో నది ఒడ్డున వేసుకున్న బెళగోడుహాళ్, సన్నాపురం, ఇటిగి, మన్నూరు, ప్రాంతాల్లో కొద్ది పాటిగా వేసుకున్న వరి పంటలకు పశుగ్రాసం పూర్తిగా డిమాండ్ పలికింది. తాలుకా పరిధిలో కాక అనంతపురం, కర్నూలు, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల నుంచి ట్రాక్టర్ల ద్వారా సుమారు రూ. పది వేలకు పైగా ట్రాక్టర్ పశుగ్రాసం, ఎద్దులబండిలో రూ. 3 వేలు డిమాండ్ పలుకుతున్నప్పటికీ రైతులు కొనుగోలు చేస్తున్నారు. కాస్తో కూస్తో అప్పుడే కోతలు ప్రారంభం కావడంతో పొలాల వద్దకే రైతులు ముందుగా వెళ్లి ఆ రైతులతో మాట్లాడుకుని కొనుగోలు చేస్తున్నారు. మొత్తానికి ఈ యేడాది వర్షాభావం లేకపోవడంతో రైతులకు కష్టాలనే మిగిల్చాయి.

ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌ల పంపిణీ



ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లు పంపిణీ చేస్తున్న రవికుమార్

సిరుగుప్ప, ఏప్రిల్ 6 : అచ్చొళ్లి ప్రభుత్వాస్పత్రి వైద్యులు రవికుమార్ ఎన్నికల సిబ్బందికి ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లను పంపిణీ చేశారు. తాలుకాలోని అచ్చొళ్లి పరిధిలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఈ బాక్స్‌లను పంపిణీ చేశారు. ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవడానికి ఈ పరికరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.

కొప్పళలో శివరాజ్ తంగడిగి ప్రచారం



మాట్లాడుతున్న మంత్రి శివరాజ్ తంగడిగి

గంగావతి రూరల్,ఏప్రిల్ 6:కుష్టగి తాలూకా కాంగ్రెస్ బహిరంగ సభలో జిల్లా ఉస్తువారి మంత్రి శివరాజ్ తంగడిగీత మాట్లాడుతూ మన అభ్యర్థి రాజ శేఖర్ హిట్నాల్‌ను అధిక మెజారిటీతో గెలిపించాన్నారు. కర్ణాటకాలో 20స్థానాలు పార్లమెంట్‌కు పంపుతామన్నారు.ప్రజలు బీజేపీ అబద్ధపుమాటలు విని విసుగెత్తి పోయారు. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కడుతారన్నారు. ఈసందర్భంలో కొప్పళ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మాజి ఎమ్మెల్యే అమరేగౌడ బయ్యాపుర, కాడా అధ్యక్షులు హసేన్‌సాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కల్లప్ప తళవార, చంద్రు, షైనుద్దీన్, శంకరగౌడ, బసవరాజ నాయక, ఉమాదేవి, హనుమనగౌడ, ప్రముఖులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి



శాంతిసభలో మాట్లాడుతున్న సీఐ ప్రకాష్ మాళిగి

కంప్లి, ఏప్రిల్ 6 : రానున్న ఉగాది, రంజాన్ పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని కంప్లి సీఐ ప్రకాష్ మాళిగి తెలిపారు. శనివారం కంప్లి పోలీస్ స్టేషన్‌లో శాంతిసభ నిర్వహించారు. అందులో హిందూ, ముస్లిం సమాజ పదాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ పండుగనైనా ఐక్యతతో అన్నదమ్ములుగా భావించుకుని జరుపుకుంటే గ్రామాలు గానీ, పట్టణాలు గానీ అభివృద్ధి చెందుతాయన్నారు. అనంతరం వివిధ సమాజ ప్రముఖులు ఊరేగింపు సమయంలో గానీ, ప్రార్థన సమయంలో గానీ రథోత్సవ సమయంలో గానీ కొద్ది వరకు పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేయాలని, ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బీఎస్ నాయుడు, బర్మప్ప, బట్ట ప్రసాద్, లడ్డూ మన్నూరువలీ, ఉస్మాన్, వీరాంజనేయులు, విద్యాధర, సీఆర్ హనుమంతు, మనోహర్, మహమ్మద్ బాషా, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

సోమేశ్వరాలయంలో విశేషపూజలు



హోసూరు, ఏప్రిల్ 6: హోసూరు రాంనగర్ ప్రాంతంలో కొలువైన పురాతనమైన స్వర్ణాంబిక సమేత సోమేశ్వరాలయంలో శనివారం ప్రదోష పూజలు ఘనంగా నిర్వహించారు. శనిత్రయోదశని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయంలోని నందీశ్వరుడికి పాలు, పెరుగు, నెయ్యి, వెన్న, పన్నీరు, చందనం, పసుపు, కుంకుమ, సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రుద్రపారాయణం, నందికి ప్రత్యేక అలంకరణలు చేశారు. మహా మంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

భారీగా నగల స్వాధీనం

హోసూరు(సిప్‌కాట్), ఏప్రిల్ 6: హోసూరు సమీపంలో జూజువాడి చెక్‌పోస్టులో బెంగళూరు నుంచి హోసూరు వైపు వస్తున్న వాహనాన్ని ఆపి సోదా చేయగా రూ.15 కోట్లు విలువైన బంగారు ఆభరణాలను గుర్తించారు. 69 బాక్సులు ఉండగా ఇందులో ఇందులో 45 బాక్సుల్లోని బంగారు ఆభరణాలకు సంబంధించి మాత్రమే సరైన పత్రాలు ఉన్నాయి. ఇక మిగిలిన 24 బాక్సులలోని నగలకు సంబంధించి తగిన వివరణ, పత్రాలు లేకపోవడం స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.15కోట్లుగా ఉంటుందని తెలుస్తోంది. వీటిని ప్రముఖ ప్రైవేట్ కర్మాగారానికి తీసుకొచ్చినట్లు అధికారుల విచారణలో తెలుస్తోంది. ఆ నగల పెట్టెలను హోసూరు సబ్ కలెక్టర్ ప్రియాంకకు అప్పగించారు.



స్వాధీనం చేసుకున్న నగల పెట్టెలతో అధికారులు

ఉరి వేసుకుని బిహార్ కార్మికుడి ఆత్మహత్య

రాయచూరు, ఏప్రిల్ 6 : భారత్‌మాలా రోడ్డు నిర్మాణంలో భాగంగా రాయచూరు తాలూకాలోని చంద్రబండా సమీపంలో కాంట్రాక్టర్‌లు వేసుకున్న షెడ్‌లో కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బిహార్‌కు చెందిన మహ్మద్ దానీశ్(34), ఎవ్వరు లేని సమయంలో శనివారం ఉదయం షెడ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గతకొంత కాలంగా ఇక్కడే పని చేస్తున్న మహ్మద్ దానీశ్ తాగుడుకు బానిసయ్యాడని ఆత్మహత్యకుగల కారణాలు తెలియలేదని స్థానికులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న యాపలదిన్ని పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. ఆత్మహత్యలకుగల కారణాల గురించి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఆత్మహత్యకు పాల్పడిన కార్మికుడు దానీశ్

సామరస్య వాతావరణంలో ఉగాది, రంజాన్



శాంతిసభలో మాట్లాడుతున్న డీఎస్పీ సత్యనారాయణ్ రావ్

రాయచూరు, ఏప్రిల్ 6 : హిందువులు ముఖ్యమైన పండుగగా జరుపుకునే ఉగాది, అదే విధంగా ముస్లింలు పవిత్ర ఉపవాస దీక్షల అనంతరం జరుపుకునే రంజాన్ పండుగను శాంతియుతంగా సామరస్య వాతావరణంలో జరుపుకోవాలని డీఎస్పీ సత్యనారాయణ్ రావ్ సూచించారు. రెండు పండుగలు ఒకే సారి వస్తున్న నేపథ్యంలో ప్రజలు పరస్పరం సహకరించుకుని ఎలాంటి సమస్యలకు తావు ఇవ్వకుండా సోదరభావంతో మెలగాలన్నారు. రెండు పండుగల నేపథ్యంలో శనివారం నగరంలోని సదర్ బజార్ పోలీస్ స్టేషన్‌లో శాంతి సభ నిర్వహించారు. సమావేశంలో మాట్లాడిన డీఎస్పీ, రంజాన్ సందర్భంగా సామూహిక ప్రార్థనలు జరుపుకునే ముస్లింలు దర్గాలకు వెళ్లెందుకు ట్రాఫిక్ సమస్య లేకుండా తమ పోలీస్ శాఖ అన్ని రకాల చర్యలు తీసుకుంటుందన్నారు. అదే సమయంలో వాహనాల పై వెళ్లెవారు పార్కింగ్ సమస్య లేకుండా నిర్దేశించిన స్థలాల్లోనే తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవాలన్నారు. శాంతిభద్రతల సమస్యలకు ఆస్కారం లేకుండా పరస్పర సహకారంలో మెలగాలన్నారు.

వాంతులు.. విరేచనాలతో మహిళ మృతి

రాయచూరు, ఏప్రిల్ 6 :జిల్లాలోని సింధనూరు తాలూకా ఆస్పత్రిలో శనివారం ఉదయం మహిళ ఒకరు వాంతులు విరేచనాలతో బాధపడుతూ మృత్యువాత పడింది. యద్దలదొడ్డికి చెందిన లక్ష్మి(30), దుర్గప్ప దంపతులు కొంతకాలంగా సింధనూరు నగరంలోని సుకాలపేట జనతా కాలనీలో నివశిస్తు కూలినాలి చేస్తు జీవనం సాగిస్తున్నారు. నాల్గు నెలల క్రితం బిడ్డకు జన్మనించిన లక్ష్మీ రెండు రోజుల క్రితం అస్వస్థతకు గురికాగా సింధూరు తాలూకా ఆస్పత్రిలో చేర్పించారు. రెండు రోజుల అనంతరం కొంత ఆరోగ్యం కుదుటపడినా మరింత మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రం రాయచూరుకు వెళ్లాలని డాక్టర్‌లు సూచించినట్లు ఆమెకు చికిత్సనందిన డాక్టర్ మంజునాథ్ తెలిపారు. కాగా కుటుంబస్థులు తమ సలహాను నిర్లక్ష్యం చేశారని శనివారం అకస్మాత్తుగా ఆమెకు వాంతులు,విరేచనాలు కావడంతో మృత్యువాత పడినట్లు తెలిపారు. కాగా తల్లి మృతి చెందిన విషయం తెలియని నాల్గు నెలల పసికూన ఏడుపు ఆస్పత్రి సిబ్బందినేకాక స్థానికులను కలిచివేసింది.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

విలియమ్ వర్డ్స్‌వర్త్ (జయంతి)



విలియమ్ వర్డ్స్‌వర్త్ 1770 ఏప్రిల్ 7న జన్మించారు. ఆంగ్ల కవులలో ఎంతో పేరొందారు. 'పోయెట్ ఆఫ్ హ్యూమానిటీ'గా గుర్తింపు పొందారు. ప్రకృతితో మానవ సంబంధాలు, శృంగార అంశాలతో కూడిన రచనలు చేశారు. 'ద సొలిటరీ రీపర్', 'రెసొల్యూషన్ అండ్ ఇండిపెండెన్స్' తదితర రచనలు ఎంతో పేరొందాయి. ఆంగ్ల సాహిత్యంలో తనకో అధ్యాయాన్ని సృష్టించుకున్నారు. 'ఇంగ్లండ్ కవి గ్రహీత'గా పేరొందారు. 1850 ఏప్రిల్ 23న కన్నుమూశారు.

పండిట్ రవిశంకర్ (జయంతి)



సితార్ సంగీత విద్వాంసులు పండిట్ రవిశంకర్ 1920 ఏప్రిల్ 7న బెంగాల్ రాష్ట్రం గాజీపూర్‌లో జన్మించారు. ఆయన అసలు పేరు రబింద్రో శాంకర్ చౌదరి. సితార్ వాయిద్యం ద్వారా అనేక ప్రయోగాలు చేసి ప్రపంచ వ్యాప్తంగా సంగీత కచేరీలు, ప్రదర్శనలు ఇచ్చారు. మూడుసార్లు గ్రామీ పురస్కారం, భారతరత్న సహా పద్మభూషణ్, కాళిదాస్‌సమ్మాన్, రామన్ మెగసెసె పురస్కారం అందుకున్నారు. 2012 డిసెంబరు 11న కన్నుమూశారు.

కాపు రాజయ్య (జయంతి)



కాపు రాజయ్య మెదక్ జిల్లా సిద్దిపేటలో 1925 ఏప్రిల్ 7న జన్మించారు. హైదరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో చిత్రకళలో డిప్లమో, డ్రాయింగ్‌లో మద్రాస్ ప్రభుత్వ డిప్లమో పొందారు. లలిత కళా అకాడమీ ద్వారా చెకోస్లోవేకియా, హంగేరి, రుమేనియా, బల్గేరియా దేశాల్లో ప్రదర్శనలు చేశారు. జేఎన్‌టీయూ గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. 50దాకా అవార్డులు వచ్చాయి. రాష్ట్రప్రభుత్వం ఆయనను రజతపత్రం, తామ్రపత్రంతో, చిత్రకళాప్రపూర్ణ పేరిట సత్కరించింది. కళా ప్రవీణ, కళావిభూషణ్, హంస, లలిత కళారత్న, సీనియర్ ఫెలోషిప్ అవార్డులు అందుకున్నారు. ఆయన చిత్రాలు పార్లమెంట్ హౌస్, న్యూఢిల్లీలోని నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడ్రన్ ఆర్ట్, సాలార్జంగ్ మ్యూజియంలోనూ ఉంచారు. ప్రత్యేకించి నకాషి శైలిలో వడ్డెర మహిళ, ఎల్లమ జోగి, గోపికా కృష్ణ, పంట పొలాలు, వసంతకేళి, కోలాటం, బోనాలు, బతుకమ్మల నేపథ్యంతో ఉండేవి. 2012 ఆగస్టు 20న కన్నుమూశారు.

జాకీచాన్ (పుట్టినరోజు)



జాకీచాన్ 1954 ఏప్రిల్ 7న హాంగ్‌కాంగ్‌లో జన్మించారు. ప్రపంచవ్యాప్తంగా సినీ నటుడిగా గుర్తింపు పొందారు. మార్షల్ ఆర్టిస్ట్‌గా, నటుడిగా, స్టంట్ మ్యాన్‌గా, దర్శకుడిగా, కొరియోగ్రాఫర్‌గా, గాయకుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలి. బాల్యంలోనే సినీరంగంలో అడుగుపెట్టి ఇంతవరకు 150కుపైగా సినిమాలలో నటించారు. ఫైటింగ్‌లలో భిన్నత్వం, ఆధునాతన ఆయుధాలు, సున్నితమైన హాస్యం, సరికొత్త స్టంట్స్‌కు పెట్టింది పేరు. కుంగ్‌ఫూలో తర్ఫీదు పొందిన ఆయన 'హాంగ్‌కాంగ్ అవెన్యూ ఆఫ్ స్టార్స్', 'హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్' తదితర పురస్కారాలు అందుకున్నారు.

రామ్ గోపాలవర్మ (పుట్టినరోజు)



ప్రముఖ సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ (ఆర్‌జీవీ) 1962 ఏప్రిల్ 7న జన్మించారు. సాంకేతికంగా పరిణితి చెందిన మాఫియా, హర్రర్ నేపథ్యం కల్గిన సినిమాలను తీయడంలో సిద్ధహస్తుడు. చలనచిత్ర ప్రవేశం తెలుగులో జరిగినా తర్వాత హిందీ చిత్ర పరిశ్రమలో స్థిరపడ్డాడు. శివ, క్షణక్షణం, రంగీలా, సత్య, కంపెనీ, భూత్ తదితర సినిమాలు ఆయనకు ఎంతో పేరుతెచ్చాయి. ఫ్యాక్టరీగా సుపరిచితమైన వర్మ కార్పొరేషన్ సంస్థ పలు సినిమాలను నిర్మించింది.

పోటెత్తిన భక్తులు

కిటకిటలాడిన ఖాద్రీశుడి ఆలయం



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయం

కదిరి, ఏప్రిల్ 6: కదిరి పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి దర్శనానికి కదిరి చుట్టుపక్కల ప్రాంతలవారే కాకుండా కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఇబ్బందిలేకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. మౌలిక సదుపాయాలను అయల అధికారులు ఏర్పాటు చేశారు. ఫాల్గుణ మాసం చివరి శనివారం కావడంతో ఆలయానికి భక్తుల తాకిడి పెరిగినట్లు అర్చకులు తెలిపారు.

దేశ భద్రత కోసం బీజేపీని గెలిపించండి

పావగడ, ఏప్రిల్ 6: దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నా, ప్రజలు సుభిక్షంగా జీవించాలన్నా బీజేపీ గెలుపు అవసరం అని, మోదీ ప్రధాని కావడం అంతే ముఖ్యమని చిత్రదుర్గం పార్లమెంటు అభ్యర్థి గోవిందకార జోళ అన్నారు. శనివారం ఎస్ఎస్‌కే రంగ మందిరంలో నిర్వహించిన బీజేపీ, జేడీఎస్ కార్యకర్తల సభలో, ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. బీజేపీ అధికార హయాంలో రైతు సంక్షేమం కోసం ఎన్నో సేవలు అందించారని, ఈనెల 26న జరిగే పార్లమెంటు ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఎగువ భద్ర నీటిని పావగడ రైతులకు అందించి రుణం తీర్చుకొంటానని అన్నారు.

ప్రతి బూత్‌లో 370 ఓట్లు పెరగాలి

» బీజేపీ కార్యకర్తలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు



ప్రధాని నరేంద్రమోదీ

బెంగళూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతిబూత్‌లోనూ కనీసం 370 ఓట్లు పెరగాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచించారు. నమో యాప్ ద్వారా రాష్ట్రానికి సంబంధించిన బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తలతో చర్చాగోష్టి జరిపారు. శుక్రవారం ఆయన కార్యకర్తలతో వర్చువల్‌గా సమావేశమయ్యారు. గడిచిన ఎన్నికల్లో నమోదైన ఓట్లకంటే అదనంగా 370 ఓట్లు పెరగాలని సూచించారు. ప్రతి ఓటు ముఖ్యమేనన్నారు. ఒకటి రెండు ఓట్లు అనే నిర్లక్ష్యం చేయరాదని, కుటుంబానికి చెందిన ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా చూడాలన్నారు. కార్యకర్తలు చేతిపై గోరింటాకుతో కమలం చిహ్నం వేయించుకోవాలని సూచించారు. ఉగాది పండుగ సందర్భంగా ఈ విధానం పాటించాలన్నారు. మైసూరు కార్యకర్త రాజేశ్, శివమొగ్గ కార్యకర్త సరళ, బెళగావి కార్యకర్త శృతి, ఉడుపికి చెందిన సుప్రీత్ బండారిలు చర్చాగోష్టిలో తమ అభిప్రాయాలు పంచుకున్నారు. ఆరంభంలో ప్రధాని జగజ్యోతి బసవేశ్వర నడయాడిన కర్ణాటకకు చెందిన కార్యకర్తలతో చర్చాగోస్టి జరపడం సంతోషమన్నారు. కెంపేగౌడ, సర్ ఎం విశ్వేశ్వరయ్యల పేర్లను ప్రస్తావించారు. ఎన్నికల సమయం తక్కువగా ఉందని పని ఎక్కువగా ఉందన్నారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. పేజ్ ప్రముఖ్‌లతో మాట్లాడుతున్నారా అంటూ అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజూ ఎన్ని ఇళ్లను సందర్శిస్తున్నారని, రామమందిర స్థాపన ప్రభావం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఓటర్లకు రిపోర్టు కార్డు ఇవ్వాలని, పేజ్ ప్రముఖ్‌లతో మూడు గ్రూపులుగా చేసుకుని ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం చేయాలన్నారు. అందులో ఓ మహిళ ఉండాలన్నారు. ఒక్కో ఇంట్లో అరగంట గడపాలని, ప్రచారం ఓవైపు బీజేపీకి ఓటు వేస్తామని అంగీకారం మరోవైపు జరగాలన్నారు. వారి ఇంటికి వెళ్లినప్పుడు నీరు, కాఫీ తాగుతూనే అన్ని అంశాలను ప్రస్తావించాలన్నారు. యువత, సీనియర్లు, మహిళలతోపాటు ఓటర్లందరితోనూ వారి అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. అందరితో ఒకే విధంగా మాట్లాడితే సరిపోదన్నారు. యువకుడి ఆలోచనలు, మహిళల కుటుంబ అంశాలు, వృద్ధుల ఆరోగ్యంకై ప్రభుత్వ సంక్షేమాల గురించి వివరించాలన్నారు. ఓ చిన్న పుస్తకం వెంట ఉంచుకోవాలని, ఏఏ అంశాలు మాట్లాడాలనేది ప్రస్తావంచాలన్నారు. ఇంట్లో ఏ సమయంలో ఉంటారో తెలుసుకుని, అప్పుడే వారి చెంతకు వెళ్లాలన్నారు. ప్రతిరోజూ రాత్రి ఒక సమావేశం ఏర్పాటు చేసుకుని మరుసటి రోజు ఏం చేయాలనే అంశంపై చర్చించుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రతి ఇంటికి, ఓటరుకు బీజేపీ అమలు చేసిన సంక్షేమాలు, పదేళ్లలో దేశ ప్రగతిని వివరించాలన్నారు.

నాడప్రభు కెంపేగౌడ బయోపిక్‌కు సన్నాహాలు



కెంపేగౌడ విగ్రహం

బెంగళూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర నిర్మాత కెంపేగౌడ బయోపిక్‌కు సన్నాహాలు సిద్ధమయ్యాయి. దినేశ్‌బాబు దర్శకత్వం వహించనున్నారు. 'ధర్మభీరు నాడప్రభు కెంపేగౌడ' అనే టైటిల్‌తో నిర్మించదలిచారు. కిరణ్ తోటంబైల్ పెట్టుబడులు పెట్టదలిచారు. ఇప్పటికే పలు చారిత్రాత్మక వ్యక్తుల బయోపిక్‌లతో సినిమాలు వచ్చాయి. అయితే సుదీర్ఘకాలంగా కెంపేగౌడ సాహసాలపై ఓ సినిమా రూపొందించాలనే ఆలోచన ఉండేది. కన్నడ కంఠీరవ డాక్టర్ రాజ్‌కుమార్ కూడా ఇదే ఆలోచన వ్యక్తం చేశారు. ఇందుకు దర్శకుడు నాగాభరణ సినిమా రూపొందిస్తారనే ప్రచారం జరిగింది. యువరాజ్ నటిస్తారని కూడా హల్‌చల్ చేసింది. అయితే నాగాభరణ మాత్రం నాకు అటువంటి ఆలోచన లేదని, కథ సిద్ధంగా లేదని తేల్చి చెప్పారు. తాజాగా దినేశ్‌బాబు సాహసమైన సినిమా తీసేందుకు సిద్ధమయ్యారు. ప్రముఖ నటుడు ఒకరు కెంపేగౌడ పాత్రను పోషించనున్నారు. ప్రముఖ చరిత్రకారులు ఆరేనహళ్ళి ధర్మేంద్రకుమార్ కథ రూపొందించగా ఛాయాగ్రాహకుడిగా సంకేత్ వ్యవహరిస్తున్నారు. రఘు నిడువళ్ళి మాటలు సమకూర్చారు. చారిత్రాత్మక కథలురూపొందించడం అంత సులువు కాదు. గతంలో కొన్ని సినిమాలలో కెంపేగౌడకు సంబంధించిన కొన్ని దృశ్యాలు మాత్రమే వచ్చాయి. అయితే సంపూర్ణంగా ఆయన జీవిత చరిత్రకు సంబంధించిన సినిమా రాలేదు. కెంపేగౌడ పేరిట బయోపిక్ రానుండడం ఇదే తొలిసారి.

ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు వేయండి



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఈఓ రవికుమార్

బంగారపేట, ఏప్రిల్ 6: ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని తాలూకా స్వీప్ సమితి అధ్యక్షుడిగా ఉన్న తాలూకా పంచాయతీ ఈఓ రవికుమార్ పిలుపునిచ్చారు. తాలూకాలోని ప్రైవేట్ గార్మెంట్స్‌లో శనివారం మధ్యాహ్నం ఓటు హక్కుపై జాగృతి కల్పిస్తూ అక్కడి సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలిష్ఠ దేశ నిర్మాణం రాజ్యాంగ ఆశయమని ఇందుకు ప్రజలంతా తమ ఓటు ద్వారా ప్రజాస్వామ్య ప్రభుత్వానికి సహకరించాలన్నారు. తాలూకా స్వీప్ సమితి ఆధ్వర్యంలో ఓటు హక్కుపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని ఈనెల 26న తప్పక ఓటు వేయాలన్నారు. 18ఏళ్లు పూర్తి చేసుకున్నవారు తమ ఓటు హక్కు వినియోగించు కోవాలన్నారు. అది ప్రజలందరి కర్తవ్యమ న్నారు. తద్వారా వందశాతం ఓటింగ్‌కు సహకరించాలన్నారు. కార్యక్రమంలో పీడీఓలు శంకర్, చిత్ర, గార్మెంట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

రంగవల్లులతో ఓటు హక్కుపై జాగృతి

శిడ్లఘట్ట, ఏప్రిల్ 6: తాలూకా స్వీప్ సమితి ఆధ్వర్యంలో తాలూకా వ్యాప్తంగా ఓటు హక్కుపై రంగవల్లులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పీడీఓ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. 18ఏళ్లు పైబడినవారంతా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. రంగవల్లుల జాథాలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్య పండుగలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మళ్ళూరు, బశెట్టిహళ్ళి, సుమనహళ్ళి, దేవరమళ్ళూరు, తిమ్మసంద్ర, కుంబిగానహళ్ళి, కుందలగుర్కి, సాదలి, గంజిగుంట, నాగమంగల, తదితర గ్రామాల పీడీఓలు, గ్రామ పంచా యతీల సిబ్బంది, ఆశా కార్యకర్తలు, స్వసహాయ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నార్లు

ఓటుహక్కుపై దివ్యాంగులతో బైక్‌జాతా

చింతామణి, ఏప్రిల్ 6: లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా తాలూకా స్వీప్‌సమితి ఆధ్వర్యంలో పలు జాతాలు నిర్వహిస్తున్నారు. తాలూకా స్వీప్ సమితి అధ్యక్షుడు, పంచాయతీ కార్యనిర్వహణాధికారి ఎస్ ఆనంద్ నేతృత్వంలో పట్టణంలో దివ్యాంగులతో బైక్ జాథా నిర్వహించారు. అనంతరం బెంగళూరు సర్కిల్‌లో స్థానికులచేత ఓటుహక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ తప్పకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ప్రజలు తమ విలువైన ఓటును వేసి సరైన నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు వేయాలన్నారు. జాతాలో తహసీల్దారు సుదర్శన్ యాదవ్, నగరసభ కమిషనర్ మాధవి, బీఈఓ ఉమాదేవి, నరేగా ఏడీ కవితా, మంజునాథ్, వివిధ గ్రామపంచాయతీల పీడీఓలు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. స్థానికులు సైతం జాతాలో పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఓటు హక్కుపై దివ్యాంగులను జాతాలో భాగస్వామ్యులను చేయడంపై ప్రశంసలు వ్యక్తం అవుతున్నాయి.



జాతాలో పాల్గొన్న ప్రజలు



జాతాలో తాలూకా స్వీప్‌సమితి అధ్యక్షుడు ఆనంద్ తదితరులు

నాటక రంగ మనుగడకు కృషి



కురుక్షేత్ర నాటకంలోని ఓ సన్నివేశం

విజయపుర, ఏప్రిల్ 6: మారుతున్న సాంకేతికత నడు కూడా నాటకరంగం మనుగడకోసం స్థానిక కళాకారులు చేస్తున్న పరంపర అభినందనీయమని దండిగానహళ్ళి గ్రామపంచాయతీ సభ్యుడు దేవరాజ్ అభిప్రాయపడ్డారు. దేవనహళ్ళి తాలూకా విజయపుర హోబళి కోరమంగల గ్రామపంచాయతీ దండిగానహళ్ళిలో చన్నకేశవస్వామి కృపాపోషిత నాటక కళామండలి ఆధ్వర్యంలో ఏర్పాటైన కురుక్షేత్ర పౌరాణిక నాటకాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జానపదం వెనుక పౌరాణిక నాటకాలు, జానపద సాహిత్యం నిరంతరం ఉండేలా సహకారిగా ఉందన్నారు. నేటి యువత నాటకరంగానికి తమవంతు చేయూత ఇవ్వాలన్నారు. కాగా మహాభారతంలోని పాత్రల ద్వారా శ్రీకృష్ణుడి చతురత్వం, అర్జునుడి ధీరత్వం, దుర్యోధనుడి స్వాభిమానం, కర్ణుడి త్యాగం, శకుని కుటిలబుద్ధి, ధర్మరాజు యొక్క ధర్మపాలన వంటి అంశాలు మనం తెలుసుకోవచ్చునన్నారు. ఇందుకు అనుగుణంగా పాత్రధారుల నటన ప్రేక్షకులను రంజింపచేసింది. చుట్టుపక్కల గ్రామాలనుంచి కూడా ప్రజలు నాటకాన్ని తిలకించేందుకు విచ్చేశారు.

గ్యారెంటీలతో పేదలకు లబ్ధి



ప్రసంగిస్తున్న బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు రవీంద్ర

బొమ్మనహళ్ళి, ఏప్రిల్ 6: రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో కొన్ని నెలలుగా అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలతో కోట్లాది మంది ప్రజలు లబ్ధి పొందుతున్నారని అభివృద్ధి కార్యక్రమాలు కూడా ఆశించిన మేరకు జరుగుతున్నాయని బొమ్మనహళ్ళి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రవీంద్ర అభిప్రాయపడ్డారు. శనివారం అరికెరెలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు. ప్రజలు కూడా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్‌కు లభిస్తున్న ఆదరణను ఓర్వలేక బీజేపీ నాయకులు ఆరోపణలు గుప్పిస్తున్నారని మండిపడ్డారు. బెంగళూరు దక్షిణ కాంగ్రెస్ అభ్యర్థి సౌమ్యరెడ్డి విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మంత్రి రామ లింగారెడ్డి నేతృత్వంలో తామంతా ముందుకు వెళ్త న్నట్టు తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ నారాయణ స్వామి, కేపీసీసీ సభ్యుడు శ్రీనివాస్, సయ్యద్ సర్దార్, స్థానిక యువనేత లోకేశ్‌రెడ్డి, ఉమా శ్రీనివాసరెడ్డి, పటేల్‌రాజు, సత్యనారాయణ, ఓబులేశు, మధుసూధన్‌రెడ్డి, అంబరీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ అధికారుల వల్లే ప్రభుత్వ విద్య నాశనం

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 6: విద్యాశాఖ అధికారుల వల్లే ప్రభుత్వ విద్య నాశనమవుతోందని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆరోపించారు. ప్రతి ఏడాది ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీని విద్యార్థి సంఘాలు తెలుపుతున్నా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టడం లేదన్నారు. శనివారం స్థానిక బీసీ హాస్టల్ వద్ద ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే కార్పొరేట్ విద్యా సంస్థలు ముందస్తు అడ్మిషన్లు ప్రారంభించి దోపిడీకి పాల్పడుతున్నాయన్నారు. ఈ విషయం విద్యాశాఖ అధికారులకు తెలిసినా స్పందన లేదన్నారు. విద్యార్థుల తల్లితండ్రుల వద్ద లక్షలాది రూపాయలు ఫీజులు దండుకుని కనీస సౌకర్యాలు కూడా సంస్థలు ఏర్పాటు చేయలేదన్నారు. తమ పిల్లలు పెద్ద చదువులు చదవాలని తల్లితండ్రులు అప్పులు చేసి చదివిస్తున్నారన్నారు. కళాశాలల్లో తాగునీరు, మరుగుదొడ్ల వసతి కూడా సరిగా ఉండదన్నారు. విద్యార్థులకు అన్యాయం జరిగితే ఎస్ఎఫ్ఐ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు తరుణ్, జస్వంత్, పవన్, ఉదయ్, హేమంత్, సంతోష్, సురేష్, ధనుష్, తిరుమలేష్, రఘు, కిరణ్ పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

'నా ఆరోగ్యం నా హక్కు' నినాదం పాటించాలి

బెంగళూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి వ్యక్తి 'నా ఆరోగ్యం నా హక్కు' అనే నినాదంతో ముందుకెళ్లాలని కిందర్ ఆసుపత్రి న్యూట్రిషనిస్ట్ డాక్టర్ సంజనా ప్రేమ్ లాల్ అభిప్రాయపడ్డారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ ఏడాది 'నా ఆరోగ్యం నా హక్కు' అనే నినాదాన్ని ప్రకటించిందన్నారు. ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆహారం విషయంలో శరీరానికి తగినంత ప్రొటీన్‌లు, కార్బోహైడ్రేట్‌లతోపాటు పోషక విలువలు కల్గిన పదార్థాలను నిత్యం తీసుకోవాలన్నారు. తాజా ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ప్రతిరోజూ నిద్రకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నిద్రించేముందు కాఫీ తాగరాదని, మొబైల్, కంప్యూటర్‌లు చూడరాదన్నారు. ఉత్తమ వ్యాయామం పాటించాలని, ప్రతిరోజూ శరీరానికి తగిన శ్రమ ఉండాలన్నారు. ఏడాదికోసారి ఆరోగ్య పరీక్షలు జరిపించుకోవాలని, ఒత్తిళ్లనుంచి ఉపశమనం పొందాలన్నారు.

నేడు కుమారస్వామి లే అవుట్‌లో ఉచిత వైద్య శిబిరం

బెంగళూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కుమారస్వామి లే అవుట్‌లోని బ్లాసమ్ స్కూల్‌లో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటవుతున్నట్టు స్వస్థ సమృద్ధ భారత, భారతీయ ఆయుర్వేద ప్రతిష్ఠాన వ్యవస్థాపకుడు డాక్టర్ సీఏ కిశోర్ తెలిపారు. కర్ణాటక కేన్సర్ సొసైటీ, దయానందసాగర్ డెంటల్ కళాశాల, నేత్రధామ కంటి ఆసుపత్రి, ఎవెక్సియా న్యూట్రిషన్ సంస్థలు భాగస్వామ్యం అవుతుండగా రోటరీ బెంగళూరు బసవనగుడి, స్వస్థ సమృద్ధి భారత సంస్థలు సంయుక్తంగా శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నాయి. శిబిరంలో ఉచితంగా కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, తగిన సలహా సూచనలు చేయనున్నారు. వైద్య సేవలు పొందదలిచేవారు 8971370736కు ఫోన్ చేసి రిజిస్టర్ చేసుకోవాలని కోరారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో కర్ణాటక హైకోర్టు జడ్జిలు



మంచాలమ్మ సన్నిధిలో కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ బసవరాజు

మంత్రాలయం, ఏప్రిల్ 6: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక రాష్ట్ర జడ్జిలు జస్టిస్ బసవరాజు, జస్టిస్ రాజేంద్ర బధామికర్ శనివారం వేర్వేరు సమయాల్లో రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. వీరికి మహాముఖ ద్వారం వద్ద మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తిలు ఘన స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనంకు విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షింతలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట మాధవరం ఎస్ఐ కృష్ణమూర్తి, ఏఎస్ఐ ఆనందరెడ్డి, బిందు మాధవ్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, భీమ్‌సేన్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజార్ తదితరులు ఉన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న స్వామివారు

పెనుకొండ, ఏప్రిల్ 6: పట్టణంలోని భోగసముద్రం చెరువు వద్ద వెలసిన దక్షిణముఖ అంజనేయస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం అర్చకులు విశ్వనాథ్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం గావించారు.

వెండి కవచ ద్వారం ఆవిష్కరణ

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 6: పట్టణ పరిధిలోని పేట వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వెండి కవచ ద్వారాన్ని శనివారం ఆవిష్కరించారు. దాత ప్రమోద్‌నాథ్ కుటుంబ సభ్యులు 25 కేజీల వెండి కవచాన్ని చేయించారు. శనివారం తెల్లవారు జాము నుంచే ఆలయంలో మూలవిరాట్‌కు వివిధ అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. మూలవిరాట్‌ను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాలతో ప్రాకారోత్సవం నిర్వహించారు. గోవింద నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. కార్యక్రమంలో ఈఓ నరసింహమూర్తి, కమిటీ మెంబర్లు రామ్మూర్తి, విజయ్, భారతి, నారాయణస్వామి, హనుమంతు, సుంకు మురళికృష్ణ పాల్గొన్నారు.



అలంకరణలో స్వామివారు